## క్లుప్తంగా...

### నేడు గరికపాటి ప్రవచనం

సనత్‌నగర్: బేగంపేట ప్రకాష్‌నగర్‌లోని భూలక్ష్మీ అమ్మవారి దేవాలయం ప్రాంగణంలో ప్రముఖ ప్రవచనకర్త గరికపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచనం ఉంటుందని ఆలయ ధర్మకర్త విశాలసూదం ఓ ప్రకటనలో తెలిపారు. దేవీ నవరాత్రుల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రవచన కార్యక్రమం ప్రారంభం అవుతుందన్నారు.

### ఉత్సాహంగా 3-కే రన్

రాంగోపాల్‌పేట్: ప్రముఖ ఆర్థిక సేవల సంస్థ ఈసీఎస్ ఫైనాన్సియల్ ఆధ్వర్యంలో పెట్టుబడిదారుల వారోత్సవాల సందర్భంగా ప్యారడైజ్ నుంచి సింధీకాలనీ వరకు భారత్ నివేష్ 3కే రన్ నిర్వహించారు. ప్రజల్లో పెట్టుబడి ప్రాముఖ్యం, ఆర్థిక శ్రేయస్సు, ఆర్థిక ఆరోగ్యం గురించి అవగాహన కల్పించేందుకు ఈ ర్యాలీని చేపట్టారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. పెట్టుబడిపై చాలా మందికి అవగాహన లేకపోవడంతో ఆర్థికంగా ముందుకు వెళ్లడం లేదన్నారు. పెట్టుబడి పెట్టేందుకు ప్రోత్సహించడంతో పాటు వారి ఆర్థిక శ్రేయస్సు కోసం తమ వంతు ప్రయత్నాలు చేపట్టి ప్రజల్లో అవగాహన, సాధికారిత పెంపొందిస్తున్నామన్నారు. అసోసియేషన్ ఆఫ్ మ్యూచువల్ ఫండ్స్ ఇన్ ఇండియాతో పాటు వివిధ సంస్థలతో కలిసి ప్రజల్లో మరింత అవగాహన కల్పించేందుకు రకరకాల కార్యక్రమాలను చేపడుతున్నట్లు చెప్పారు.

### ఎస్సీ వర్గీకరణపై కేంద్రం స్పందించాలి

లాలాపేట: ఎస్సీ వర్గీకరణ కోసం చేపట్టిన మాదిగల విశ్వరూప పాదయాత్ర, సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. వర్గీకరణ ఉద్యమం ప్రచారంలో భాగంగా శనివారం పలువురు నాయకులు బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిసి కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం సీఎం కేసీఆర్ గతంలోనే అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపించారని దీనిపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా సమస్యను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో బాస్కుల కొమురయ్య, అంజయ్య, లాజర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రవల్లిక కుటుంబాన్ని ఆదుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ: ప్రవల్లిక మృతికి ఓయూలో వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా నిరసనలు, నివాళ్లు అర్పించారు. శనివారం విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో లైబ్రరీని బహిష్కరించి ప్లకార్డులను ప్రదర్శిస్తూ ర్యాలీగా ఆర్ట్స్ కాలేజీకి చేరుకొని ధర్నా చేపట్టారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎస్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో నివాళి అర్పించారు. విద్యార్థి, నిరుద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీఆర్ఎస్‌ను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు ప్రతిజ్ఞ చేశారు. ప్రవల్లిక మరణం ప్రభుత్వ హత్యేనని ఆమె కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోకుండా పోరాడి ఉద్యోగాలు సాధించాలని కాంగ్రెస్ నేత రియాజ్ విజ్ఞప్తి చేశారు.

### ఏటీఎంలో డబ్బులు డ్రా చేసి.. ఆపై రాలేదని ఫిర్యాదు

- రూ.1,18,500 మాయమయ్యాయంటూ బ్యాంక్ నుంచి పొందిన వైనం
- అధికారుల ఫిర్యాదుతో వెలుగులోకి, సదరు వ్యక్తిపై ఫిర్యాదు

సనత్‌నగర్: బ్యాంక్ ఏటీఎం నుంచి పలుమార్లు నగదు డ్రా చేసుకున్న ఓ అగంతకుడు డబ్బు రాలేదని బుకాయిస్తూ ఆన్‌లైన్ ద్వారా నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ)కి ఫిర్యాదు చేయడంతో అమీర్‌పేటలోని ఏపీ రాజరాజేశ్వరి మహిళా కో-ఆపరేటివ్ అర్బన్ లిమిటెడ్ బ్యాంక్ అధికారులు సదరు వ్యక్తికి తిరిగి నగదు చెల్లించారు. అయితే.. నగదు డ్రా చేసుకుని కూడా రాలేదని ఫిర్యాదు చేసినట్లు ఆలస్యంగా గుర్తించి శనివారం ఎస్సార్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఐ సీహెచ్.రఘురాములు వివరాల ప్రకారం.. ఓ అగంతకుడు తన ఆక్సిస్, పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఏటీఎం కార్డుల ద్వారా ఏపీ రాజరాజేశ్వరీ మహిళా కో-ఆపరేటివ్ అర్బన్ లిమిటెడ్ బ్యాంక్ ఏటీఎం నుంచి ఆగస్టు 31న రూ.18,500, సెప్టెంబర్ 5న రూ.40 వేలు, 7న 20 వేలు, 9న 40 వేల నగదు కలిపి మొత్తం రూ.1,18,500 డ్రా చేశాడు. నగదు డ్రా చేసిన సమయాల్లో ఏటీఎంలలోని సీసీ కెమెరాలకు చేతులు అడ్డం పెట్టాడు. ఆ తర్వాత ఏటీఎంల నుంచి నగదు రాలేదని, అయినప్పటికీ తన ఖాతాలో నుంచి నగదు మాయమైందంటూ ఫిర్యాదు చేశా డు. ఈ ఫిర్యాదు మేరకు ఏపీ రాజరాజేశ్వరీ మహిళా కో-ఆపరేటివ్ అర్బన్ లిమిటెడ్ బ్యాంక్ అధికారులు అతని ఖాతాకు తిరిగి రూ.1,18,500 నగదు చెల్లించారు. ఆ తరువాత లెక్కలు చూసుకున్న బ్యాంక్ అధికారులు అగంతకుడు నగదు తీసుకుని కూడా రాలేదని ఫిర్యాదు చేసినట్లు గుర్తించారు. దీంతో ఏపీ రాజరాజేశ్వరీ మహిళా కో-ఆపరేటివ్ అర్బన్ లిమిటెడ్ బ్యాంక్ మేనేజర్ దుర్గ ఫిర్యాదు చేశారు.

# కంటోన్మెంట్‌ను కట్టబెట్టేదెవరికో?

ఆరుసార్లు కాంగ్రెస్, ఐదుసార్లు టీడీపీ విజయం

ఐదుసార్లు ఎన్నికైన దివంగత నేత సాయన్న

జంగ్ 2023 తెలంగాణ



రసూల్‌పురా: రక్షణ మంత్రిత్వ శాఖ ఆధీనంలో ఉన్న కంటోన్మెంట్ ప్రాంతాన్ని కలిపి నియోజకవర్గంగా ఏర్పాటు చేసిన సమయంలో జనరల్ నియోజకవర్గం ఉన్నప్పటికి 1967 నుంచి ఎస్సీ రిజర్వు స్థానంగా రూపాంతరం చెందింది. 1957 నుంచి నియోజకవర్గంగా ఏర్పాటైన నాటి నుంచి ఆరుసార్లు కాంగ్రెస్, ఐదుసార్లు టీడీపీ, జనతాపార్టీకి ఒకసారి స్వతంత్ర్య అభ్యర్థికి ఒకసారి బీఆర్ఎస్‌కు ఒకసారి ఓటర్లు పట్టం కట్టారు. 2018లో జరిగిన ఎన్నికల్లో మొదటిసారి బీఆర్ఎస్ ఇక్కడ జెండా ఎగరవేసింది. ఈసారి జరిగే ఎన్నికల్లో కంటోన్మెంట్ ప్రజలు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే. కాగా కంటోన్మెంట్ నియోజకవర్గం నుంచి దివంగత ఎమ్మెల్యే జి. సాయన్న హ్యాట్రిక్‌తో సహా ఐదుసార్లు (నాలుగు సార్లు టీడీపీ నుంచి ఒకసారి బీఆర్ఎస్) నుంచి ఎన్నికయ్యారు. ఇక రెండుసార్లు బీవీ.గురుమూర్తి మిగిలిన వారు ఒక్కోసారి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు.

**అత్యల్పంగా మశ్చేందర్‌రావు.. అత్యధికంగా సాయన్న ..**

14 సార్లు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జనతాపార్టీ నుంచి పోటీ చేసిన బీ. మశ్చేందర్‌రావు ఇండియన్ కాంగ్రెస్ అభ్యర్థి ఐ. ముత్తుస్వామిపై అత్యల్పంగా 366 మెజార్టీ సాధించారు. అత్యధికంగా 2018లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసిన జీ. సాయన్న కాంగ్రెస్ అభ్యర్థి సర్వే సత్యనారాయణపై 37563 మెజార్టీ సాధించారు.

**కంటోన్మెంట్ నుంచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారి వివరాలు**

| | | |
|---|---|---|
| 1957 | బీవీ గురుమూర్తి | కాంగ్రెస్ |
| 1962 | బీవీ.గురుమూర్తి | కాంగ్రెస్ |
| 1967 | వీ.రామరావు | కాంగ్రెస్ |
| 1972 | వీ.మంకమ్మ | కాంగ్రెస్ |
| 1978 | బీ.మశ్చేందర్ రావు | జనతాపార్టీ |
| 1983 | ఎన్. ఏ క్రిష్ణ | స్వతంత్ర్య అభ్యర్థి |
| 1985 | సర్వే సత్యనారాయణ | టీడీపీ |
| 1989 | డీ.నర్సింగ్‌రావు | కాంగ్రెస్ |
| 1994 | జీ.సాయన్న | టీడీపీ |
| 1999 | జీ.సాయన్న | టీడీపీ |
| 2004 | జీ.సాయన్న | టీడీపీ |
| 2009 | జీ.శంకర్రావు | కాంగ్రెస్ |
| 2014 | జీ.సాయన్న | టీడీపీ |
| 2018 | జీ.సాయన్న | బీఆర్ఎస్ |

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని ఎనిమిది వార్డులు జీహెచ్ఎంసీ పరిధిలోని మోండా డివిజన్ కలుపుకొని ఉన్న ప్రస్తుత కంటోన్మెంట్ నియోజకవర్గంలో 232 పోలింగ్ స్టేషన్ల పరిధిలో మొత్తం 246821 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 124350 ఉండగా మహిళలు 122459, ఇతరులు 12 మంది ఉన్నారు.

## తొమ్మిదేళ్ల అభివృద్ధే నన్ను గెలిపిస్తోంది

మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్



మంత్రి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు

సనత్‌నగర్: గడిచిన తొమ్మిదిన్నర ఏళ్లలో సనత్‌నగర్ నియోజకవర్గంలో కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేశామని అదే తనను మరోసారి గెలిపిస్తోందని బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 19 నుంచి 27 వరకు మొదటి విడత పాదయాత్ర చేపట్టనున్నట్లు ఆయన ప్రకటించారు. నవంబర్ 9న తాను ఎన్నికల నామినేషన్ వేయనున్నట్లు మంత్రి వెల్లడించారు.

**బీఆర్ఎస్‌లో చేరిక..**

- అమీర్‌పేట డివిజన్‌కు చెందిన పలువురు బీజేపీ నేతలు శనివారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. మాజీ కార్పొరేటర్ శేషుకుమారి ఆధ్వర్యంలో అమీర్‌పేట డివిజన్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్ రాజ్ పురోహిత్ నాయకత్వంలో భారీగా చైన్‌సింగ్, దేవేందర్‌సింగ్, సర్దార్‌బేగ్‌సింగ్, సామిక్‌సాల్, అశోక్ మంచాల, అశ్విన్‌రాజ్ పురోహిత్, దర్శన్‌రాజ్ పురోహిత్, భాను శ్రీకాంత్, అశోక్‌రాజ్ పురోహిత్, విజయ్‌సింగ్ రాజ్ పురోహిత్, శంకర్‌లాల్ కచ్వా, శ్రవణ్ రాజ్‌పురోహిత్ బీఆర్ఎస్‌లో చేరారు.
- అంతర్జాతీయ కరాటే పోటీ విజేత సాయికుమార్‌ను మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అభినందించారు. హైదరాబాద్‌లో ఈ నెల 8 నుంచి 10 తేదీల్లో రసూల్‌పురాకు చెందిన మంచోల్ల సాయికుమార్ తెలంగాణ రాష్ట్రం నుంచి విజేతగా ప్రథమ స్థానం గెలిచి బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు గురువు మాస్టర్ షేక్ కలీమ్‌ను మంత్రి అభినందించారు. మంత్రిని కలిసిన వారిలో రసూల్‌పురాకు చెందిన మంచోళ్ల రాములు, శివ, రాజేష్, రాజు, శివ, లాలయ్య ఉన్నారు.

## కుటుంబ పాలనకు చరమగీతం పాడాలి



కేంద్ర మంత్రిని సత్కరిస్తున్న సత్యమూర్తి

రాంగోపాల్‌పేట్: ప్రజాస్వామ్య దేశం ఏ ఒక్కరు, ఏ కుటుంబం సొంతం కాదని, తెలంగాణలో సాగుతున్న కుటుంబ పాలనకు చరమగీతం పాడాల్సిన సమయం ఆసన్నమైందని కేంద్ర పౌర సరఫరాలు, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి అన్నారు. ఎన్నికల ప్రచార కార్యక్రమం కోసం నగరానికి వచ్చిన ఆమె ఎఫ్‌సీఐ ఎస్ఎల్‌సీసీ కమిటీ సభ్యుడు ఎస్ సత్యమూర్తి ఆహ్వానం మేరకు సంగీత్ చౌరస్తాలోని ఆయన కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ప్రశ్నించే వాళ్ల గొంతు నొక్కుతూ నియంత పాలన సాగిస్తున్నారన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన నిధులను వినియోగించుకోవడంలో రాష్ట్రం విఫలమైందని ఆరోపించారు.

## కంటోన్మెంట్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యం

రసూల్‌పురా: గత తొమ్మిదిన్నర ఏళ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం కంటోన్మెంట్ నియోజకవర్గాన్ని నిర్లక్ష్యం చేసిందని బోర్డు నామినేటెడ్ సభ్యులు రామకృష్ణ ఆరోపించారు. శనివారం కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో గోవా రాష్ట్ర బీజేపీ అధ్యక్షులు పార్లమెంట్ ప్రభారి శేట్ తన్వాడే అధ్యక్షతన కంటోన్మెంట్ అసెంబ్లీ బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జులు పోలింగ్‌బూత్ కమిటీల సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రామకృష్ణ మాట్లాడుతూ మల్కాజ్‌గిరి ఎంపీగా గెలిచిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి సైతం గెలిచిన ఈ నాలుగున్నరేళ్లలో కంటోన్మెంట్ ప్రాంతానికి ఏం చేశారని చెప్పాలన్నారు. కేంద్రంసహకారంతో కంటోన్మెంట్ పరిధిలో రూ.18 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నాగురావు నామోజీ, కార్పొరేటర్ కొంతం దీపికా, పరశురాం, సుష్మీత. బీఎన్. శ్రీనివాస్, బానుక మల్లికార్జున్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

## బతుకమ్మ సంబురం



జెక్‌కాలనీలో రెండో రోడ్డులో అనంతరెడ్డి బంగ్లా వద్ద బతుకమ్మ ఆడుతున్న మహిళలు



లక్ష్మీనివాస్ అపార్ట్‌మెంట్ వద్ద బతుకమ్మ సంబరాలు



బతుకమ్మ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి

బతుకమ్మ వేడుకలను సనత్‌నగర్ నియోజకవర్గంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.జెక్‌కాలనీ బతుకమ్మ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం బతుకమ్మ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు చింతిరెడ్డి ప్రభ, ప్రధాన కార్యదర్శి, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఎస్.అన్నపూర్ణతో పాటు కమిటీ సభ్యులు పాల్గొని బతుకమ్మ ఆడారు. లాలాపేట లక్ష్మీనగర్‌లోని శ్రీ దుర్గా హైస్కూల్లో జరిగిన వేడుకల్లో విద్యార్థులు బతుకమ్మ పాటలతో హోరెత్తించారు.

- సనత్‌నగర్/లాలాపేట



శ్రీ దుర్గా హైస్కూల్‌లో బతుకమ్మ సంబరాలు

### దృష్టి మరల్చి విదేశీ కరెన్సీతో పరార్

రాంగోపాల్‌పేట్: ఓ వ్యక్తి దృష్టి మరల్చి రూ.1.70 లక్షల విదేశీ కరెన్సీని ఎత్తుకెళ్లిన ఘటన మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం.. సత్యనారాయణ అనే వ్యక్తి తిలక్‌నగర్‌లోని శాంతి ఫోరెక్స్‌లో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్నారు. ఈ నెల 12న ప్యారడైజ్ ప్రాంతంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు వచ్చి రూ.20 వేల విలువ చేసే యూరో కరెన్సీ, రూ.1.5 లక్షల విలువ చేసే థాయ్ కరెన్సీని తీసుకుని బ్యాగులో పెట్టుకుని బైక్‌పై వెళ్తున్నాడు. ఇస్లామియా మసీదు ప్రాంతానికి రాగానే మెడ వద్ద దురద పెడుతుండటంతో ద్విచక్ర వాహనాన్ని ఆపి హెల్మెట్ తీసి చూడటంతో అందులో బ్రౌన్ కలర్ పౌడర్ కనిపించింది. అంతలోనే ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చి జేబులో నుంచి డబ్బు కిందపడిందని చూపించగా అతడు వంగి ఆ డబ్బు తీసుకునే సమయంలో అదే వ్యక్తి విదేశీ కరెన్సీ ఉన్న బ్యాగును తీసుకుని పరారయ్యాడు. బాధితుడు కూడా అతన్ని వెంబడిస్తూ పరుగు పెడుతుండగా పల్సర్ వాహనంపై మరో వ్యక్తి వెనుక నుంచి వచ్చి బ్యాగ్‌తో పరారవుతున్న వ్యక్తిని ఎక్కించుకుని ఉడాయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

### 20న ఓయూ పాలక మండలి సమావేశం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పాలక మండలి (ఈసీ) సమావేశం ఈ నెల 20న జరగనుంది. రెండు సార్లు వాయిదాపడిన ఈసీ సమావేశాన్ని తిరిగి నిర్వహించేందుకు అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఎగ్జామినేషన్ బ్రాంచ్ కొనుగోళ్లు, సస్పెండ్ అయిన సూపరింటెండెంట్ ఇంజినీర్ దేవిదాస్ అంశంతో పాటు రిటైరైన ప్రొ.అన్సారీ పింఛన్ తదితర అంశాలు చర్చకు రానున్నట్లు సమాచారం.

## కంటోన్మెంట్‌లో వార్ వన్‌సైడే

మంత్రి తలసాని

కంటోన్మెంట్: దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె లాస్య నందితను కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా గెలిపించే బాధ్యత బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలపై ఉందని మంత్రి తలసాని అన్నారు. శనివారం కార్ఖానాలోని సాయన్న నివాసం వద్ద నియోజకవర్గ ముఖ్య నేతలతో భేటీ అయ్యారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సాయన్న కుమార్తె లాస్య నందిత గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలన్నారు. నేతలంతా సమన్వయంతో ముందుకెళ్లాలని సూచించారు. గత ఎన్నికల్లో తరహా కంటోన్మెంట్ లో ఈసారి కూడా వార్ వన్ సైడేనని, గులాబీ పార్టీ విజయాన్ని ఎవరూ ఆపలేరని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్, బీజేపీల మాయమాటలను ప్రజలు నమ్మడం లేదన్నారు. ఈ సమావేశంలో జక్కుల మహేశ్వర్ రెడ్డి, అనితా ప్రభాకర్, నళిని కిరణ్, పాండు యాదవ్, భాగ్యశ్రీ, శ్యాంకుమార్, లోకనాథం, బోయిన్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరిక ఆనంద్ గౌడ్, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి, టీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సందడిగా వెటరన్ టేబుల్ టెన్నిస్ పోటీలు

లాలాపేట: ప్రొ. జయశంకర్ స్టేడియం ద వెటరన్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం లాలాపేటలోని ప్రొ. జయశంకర్ ఇండోర్ స్టేడియంలో జరిగిన సెకండ్ ఇంటర్నల్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో 66 టీమ్‌లో పాల్గొన్నాయి. ఇందులో 40 సంవత్సరాలు, 60 ఏళ్లు, 70 ఏళ్లు నిండిన క్రీడాకారుల పురుషులు, మహిళా విభాగంలో జరిగిన పోటీల్లో పలువురు క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొని తమలోని క్రీడా స్ఫూర్తి చాటారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ క్రీడల్లో నైపుణ్యాన్ని భావితరాలకు అందించాలనేదే తమ ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రెసిడెంట్ దయాకర్, సెక్రటరీ బి. విఠల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

## వెంకన్నస్వామి బ్రహ్మోత్సవాలకు సిద్ధం

- పంచరాత్ర ఆగమ పద్ధతిలో నిర్వహణ
- నేటి నుంచి 23 వరకు..





చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్‌లోని శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి 46వ వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయంలో కొలువుదీరిన పద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకన్నస్వామి వారికి పంచరాత్ర ఆగమ పద్ధతిలో ఈ నెల 15 నుంచి 23వ తేది వరకు ఆగమపండితులు మాద్భాధూల రామకాన్తాచార్యులు ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టామని ఆలయ ఈఓ రాజేష్ కుమార్, ధర్మకర్తల మండలి అధ్యక్ష, ఉపాధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, వేణు గోపాలరావు తెలిపారు.

**19న స్వామివారి కల్యాణం**

వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈనెల 19వ తేదీ గురువారం ఉదయం తిరుప్పావడ సేవ, పద్మావతి గోదా సమేత ప్రసన్న వెంకన్న స్వామి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ నెల 21న వేదస్వస్తి, ముత్యపు కవచాలంకరణ, 23న శ్రీవారి అవతారోత్సవం, 108 కలశాభిషేకం, 24న విజయ దశమిని పురస్కరించుకుని సర్వదర్శనం, శమీపూజలతో పాటు ప్రతిరోజు పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

**రూ. 10 కోట్లతో నూతన ఆలయ నిర్మాణం..**

సుమారు రూ.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న స్వామివారి నూతన ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం బాలాలయంలో స్వామివారికి అన్నిరకాల కైంకర్యాలు, పూజలు నిర్వహిస్తున్నారు. ఆలయం మొత్తం కృష్ణ శిలలతో నిర్మిస్తుండగా, టీటీడీ ఆలయ శిల్పి వెంకటేష్, దేవాదాయశాఖ స్థపతి వలినాయగం ఆధ్వర్యంలో ఏడు గోపురాల నిర్మాణం కొనసాగుతోంది. నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ఆలయాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నామని, ఆలయ నిర్మాణానికి భక్తులు, ఆధ్యాత్మికవేత్తలు తమవంతు సహాయ సహకారాలు అందించాలని ఆలయ నిర్వాహకులు కోరారు.

## దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు ఆలయాలు ముస్తాబు



విద్యుద్దీపాలతో సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం

సనత్‌నగర్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలకు ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి. అమ్మవారు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు. నవరాత్రి పూజాది కార్యక్రమాల్లో భాగంగా ప్రతిరోజూ శ్రీలలితా సహస్రనామ కుంకుమార్చన, చండీహోమం, సరస్వతీపూజ, సుమంగళి పూజ, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం నుంచి 24 వరకు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.

**బేగంపేట కట్టమైసమ్మ ఆలయంలో..**

- దసరా మహోత్సవాలను కట్టమైసమ్మ ఆలయంలో వైభవోపేతంగా జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఫౌండర్ ట్రస్టీ చెక్కల సుభాష్ ముదిరాజ్ తెలిపారు. ఈ నెల 23 వరకు రోజుకొక అలంకారంలో అమ్మవారిని ముస్తాబు చేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే 23న ఉదయం 10 గంటల నుంచి చండీహోమం, పూర్ణాహుతి, ప్రతిరోజూ శ్రీలలితా సహస్రనామ కుంకుమార్చన జరుగుతుందని చెప్పారు. ప్రతిరోజూ సాయంత్రం 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు కొనసాగుతాయన్నారు.

**ప్రకాష్‌నగర్ భూదేవి ఆలయంలో...**

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు బేగంపేట్ ప్రకాష్‌నగర్‌లోని భూదేవి అమ్మవారి ఆలయ ధర్మకర్త విశాల్‌సుదం తెలిపారు. 15న సాయంత్రం 6 గంటలకు పద్మశ్రీ పురస్కార గ్రహీత శ్రీగరికిపాటి నరసింహారావు ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమం, 16, 17 తేదీల్లో సాయంత్రం 7 నుంచి మా భగవతికి చౌకి సునీల్‌శర్మ భజన బృందంతో భజనలు, 20న ఉదయం 10 గంటలకు సామూహిక అక్షరాభ్యాసం, సాయంత్రం 6 గంటలకు పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలు, 22న ఉదయం 10 గంటలకు సామూహిక చండీహోమం, రాత్రి 7 గంటల నుంచి బతుకమ్మ వేడుకలు జరుగుతాయని వివరించారు. , 24న రాత్రి 7 గంటలకు రావణ దహనం ఉంటుందన్నారు.

**రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో..**

రాంగోపాల్‌పేట్: మోండా కుమ్మరిగూడలోని రాజరాజేశ్వరీదేవి దేవాలయంలో ఈ నెల 15వ తేదీ నుంచి దసరా శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈవో చంద్రశేఖర్ తెలిపారు. అమ్మవారు ఒక్కో రోజు ఒక అలంకారంలో దర్శనం ఇస్తుందని చెప్పారు. ఈ నెల 15వ తేదీన బాలత్రిపుర సుందరీ దేవి, 16వ తేదీన గాయత్రిదేవి, 17వ తేదీ అన్నపూర్ణ అలంకారం, 18వ తేదీ లలితాదేవి, 19వ తేదీన మహాలక్ష్మిదేవి, 20వ తేదీ సరస్వతిదేవి, 21వ తేదీ భవానీదేవి, 22వ తేదీ దుర్గాదేవి, 23వ తేదీ ఉదయం మహిషాసురమర్దనీ దేవి, సాయంత్రం రాజరాజేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తుందన్నారు.